# సద్యోగం

అర్జంటు పనిమీద వాల్తేరు బయలుదేరాను. త్వరగా వెళ్ళి ఇంటరు క్లాసులో పక్కపరుచుకుంటే ఆ తరవాత అడిగేవాడుండడు. సహం అందుచేత సూర్యనారాయణను పలకరించలేదు.

అతన్ని ఒకసారి స్టేషనులో పుస్తకాల షాపుదగ్గిర చూశాను. అతనుకూడా మెయిలుకు వస్తున్నాడనే సంగతి అతన్ని ప్లాట్‌ఫాంమీద చూసేవరకూ తట్టలేదు. అప్పటికీ నమ్మకంలేదు. అతనిది మూడోక్లాసు టిక్కెట్టు తప్ప ఇంకోటయి ఉండటానికి వీలులేదు. నిజంగా ప్రయాణం చేసేవాడయితే ఎక్కడో చోటు చూచుకు కూర్చోక ఇంకా ప్లాట్‌ఫాంమీద తారట్లాడతాడు దేనికి ?

కావటానికతను నాకు బాల్యస్నేహితుడుగాని మా స్నేహంలో ఆప్యాయత పోయి చాలాకాలమయింది. ఇప్పటికి పదిహేను, పదహారేళ్ళుగా అతను పరమదరిద్రం అనుభవిస్తున్నాడు. తన చిక్కులూ, కష్టాలూ, దురదృష్టమూ తప్ప అతనికి మాట్లాడేటందుకేమీ లేకుండా పోయింది. అతనితో మాట్లాడాలని ఎవరికి ఉంటుంది? అతని కష్టాలన్నీ విన్నాక అతనికి తృణమో పణమో సహాయం చెయ్యవలసి వస్తుందేమోనని అతన్ని తప్పించుకు తిరిగే స్నేహితులుకూడా ఉండవచ్చు. నేను కాదనను. నా మటుకు నేను అతన్ని తప్పించుకు తిరగటంలో స్వార్థం ఏమీ లేదు. నిజానికి అటువంటివాడి ఆర్థిక సమస్య నేనేం తీర్చగలను? ఎప్పుడైనా ఇంత కాఫీ పోయించగలను. రెండు రూపాయలు మించకుండా చేబదులివ్వగలను. అందుచేత నా భయం డబ్బుసంచీ భయం కాదు.

సూర్యనారాయణకు ఇంకోరికష్టసుఖాలు వినిపించుకునే శక్తి పూర్తిగాపోయింది. తన దరిద్రం అతనికో విశిష్టవిషయంగా పరిణమించింది. ఇంకోడికి భార్యపోయినా, పిల్లలుపోయినా అతనికి. "అయ్యో, అట్లాగా, పాపం!" అనే శక్తిలేదు. పోనీ, తన లాగే దరిద్రంలో ఉండి ఒడ్డునపడ్డ స్నేహితుణ్ణి అభినందించే శక్తి అయినా లేదు. తన సాటివాళ్ళంతా ఏదోవిధంగా తనకంటె బాగాఉన్నారనీ, వాళ్ళకు కష్టాలు వచ్చినా తనలాటి కష్టాలు కావనీ, అన్ని కష్టాలలోకీ డబ్బులేని కష్టమే ఎక్కువైనదనీ, జేబులో నాల్గు రూపాయలుంటే ఏ ఇతర కష్టాన్నయినా ఎదుర్కోవచ్చుననీ అతను అభిప్రాయపడ్డట్టు కనిపించాడు. అతనికి అటువంటి అభిప్రాయం కలగటంలో ఆశ్చర్యంలేదు. మనకు ఏది లభించకపోతే అదల్లా అమూల్యంగా కనిపిస్తుంది.

ఏమైనా రానురాను సూర్యనారాయణతో సంభాషించటంకూడా నాకు దుర్భరంగా పరిణమించింది. అతని భావాలు నాచెవులకు పైశాచికంగానూ, నీచంగానూ వినిపించేవి. అతన్ని పలకరించటమంటే అతనిలోవున్న కుళ్ళు భరించటమన్న మాటేగాని మరొకటి కాదనిపించేది.

కొద్దికాలం క్రితం అతను పట్నం చేరాడని తెలిసింది. ఏదన్నా ఉద్యోగం దొరికిందేమో, పోనీ పాపం బాగుపడతాడనుకున్నాను. కాని అతనికి ఉద్యోగం ఏమీ లేనట్టూ ఊరికేనే తిరుగుతున్నట్టు, పట్నంలో గొప్పవాళ్ళను కొందర్ని పట్టుకుని వ్రేళ్ళాడుతున్నట్టూ విన్నాను. జలగలాగా తగులుకుంటే తృణమో కణమో పారేసే ధనికులైన ఆంధ్రులు పట్నంలో ఉన్నారు. ఫలానివాడికి ఈపాటి సహాయం చేశామని చెప్పుకోవటానికీ సాటివాణ్ని హీనంగాచూసే అవకాశం దక్కించుకోవటానికీ సూర్యనారాయణవంటి వాళ్ళకి డబ్బిచ్చేవాళ్ళున్నారు. దురదృష్టవశాత్తూ అతను కవిగాని, రచయితగాని, వక్తగాని, గాయకుడుగాని, శిల్పిగాని కాదు; అయివుంటే అతని కింకా బాగా జరిగిపోయి ఉండును.

## 2

నేను ఇంటరుక్లాసులో పక్క పరుచుకుని టైముచూస్తే బండి బయలుదేరటానికింకా ఇరవై నిమిషాలటైముంది. తాపీగా ఒక సిగరెట్టు కాల్చుకుందామనీ, కనిపిస్తే సూర్యనారాయణను లాంఛనగా పలకరిద్దామనీ బండిలోనుంచి బయటికి అడుగుపెట్టేసరికి అతనే ప్రత్యక్షమైనాడు. అతన్ని దగ్గిరగా చూసేసరికి నాకు చెప్పరాని ఆశ్చర్యం వేసింది.

అతను వేసుకున్న కోటు అంత దూరానికి ఖద్దరు కోటల్లే కనిపించింది గాని దగ్గిరిగాచూస్తే అది ఉన్నికోటు, దాని లోపల సిల్కుచొక్కా. అతని ధోవతి కూడా సిల్కుధోవతే—నేననుకున్నట్టు మాసిపోయిన మల్లు ధోవతి కాదు. అతని చేతిలో స్టేట్ఎక్స్ప్రెస్ టిన్ను, వేళ్ళకి రెండు మూడుంగరాలు అధమం ఒకటైనా రవ్వల ఉంగరం !

అతన్ని చూస్తేనే నా మనస్సులో అనేకప్రశ్నలు బయలుదేరినై. ఏమిటి దీని అర్థం ? ఇతను ధనికుడైనాడు? ఎట్లా అయినాడు ? డబ్బున్నవాడు ఇంత ఖరీదు పెట్టి ఇటువంటి నాజూకులేని గుడ్డలు కొనకపోతే అందులో సహం ఖరీదుతో ఎంతో అందమైన దుస్తులు వేసుకోవచ్చునే ? యుద్ధకాలంలో బాగుపడ్డవాళ్ళు చాలామంది ఉన్నారు. వాళ్ళల్లో ఇతను లేడని నాకు స్పష్టంగా తెలుసు. ఆరునెల్లక్రితం కూడా ఇతను పట్నంవచ్చినప్పుడు బికారిగానే వున్నాడు. ఈ లోపల ఏం జరిగింది? అతని

మొహాన ఇప్పటికీ నైచ్యం వుండనేవుంది. వొంటికి సులభంగా సిల్కులు తొడగ వచ్చుగాని మనస్సుకు తొడగడం సులభంకాదు.

"ఏమోయ్, జ్ఞాపకం ఉన్నానా?" అన్నాడు సూర్యనారాయణ. నేను సిగరెట్టు కోసం జేబులో చెయ్యి పెట్టటంచూసి తనచేతిలో టిన్ను తెరచి, "తీసుకో", అన్నాడు.

సిగిరెట్టు తీసుకుంటూ, "ఎందుకు జ్ఞాపకం లేదూ? ఈ మధ్య నడమంత్రంగా నాకేమీ ఐశ్వర్యం కలగలేదే?" అన్నాను. అతనితో అదివరకెన్నడూ అంత క్రూరంగా మాట్లాడలేదు. కాని ఇప్పటి అతని వాలకంచూస్తే దరిద్రంలో ఉన్నప్పుడే అతను కొంచెం భరించ వీలుగా వున్నాడనిపించింది. అదివరకు ప్రపంచాన్ని ప్రతిఘటించి పోరాడే వాడల్లే కనిపించిన సూర్యనారాయణ ఇప్పుడు ప్రపంచాన్ని జయించినవాడి మొహం పెట్టాడు.

నా ఎత్తిపొడుపు అతనికి అర్థమయిందిగాని అతను చలించకుండా నా కళ్ళలోకి చూస్తూ ఒక విషపునవ్వు నవ్వి "దరిద్రం స్నేహితులను పోగొట్టుతుంది. దరిద్రం పోయినమీదట వచ్చే ఐశ్వర్యం ఆ పోయిన స్నేహితు లందరినీ శత్రువులుగా మారుస్తుంది" అన్నాడతను.

కళ్ళల్లోకి చూసి మాట్లాడేవాళ్ళను చూస్తే నాకు మంట. నే నతనికన్న తీక్షణంగా కాస్సేపు అతని కళ్ళల్లోకి చూసి క్షణంలో అతనిచూపు దింపేశాను. అతనిలో సాహసము వున్నంతగా ధైర్యం లేదని రూఢి అయిపోయింది. ఆ సాహసమైనా డబ్బుతో వచ్చిన సాహసమే. అతను ఏంచేసి డబ్బు సంపాదించాడో తెలీదుగాని, ఆ సంపాదించిన పద్ధతి గౌరవనీయమైనదై వుండదు. వుంటే అతనింత పిరికిగా ప్రవర్తించవలసిన అవసరం లేదు.

"నువ్వు కొంచెం పొరపాటు పడుతున్నావు సూర్యనారాయణా! అసలు సంగతి నువు చెప్పిందికాదు; మనకు దరిద్రం వచ్చినప్పుడు మన స్నేహితులంతా మనని శత్రువుగా చూస్తున్నా రనుకుంటాం. మనకు మాత్రం వాళ్ళ మైత్రితో అవసరం వుంటుంది. మనకు మళ్ళీ డబ్బు వచ్చినాక ఆ అవసరం తీరిపోతుంది. అప్పుడు మనం స్నేహితులందర్నీ శత్రువులుగా చూడటం ప్రారంభించి వాళ్ళమీద ఏదో పగ తీర్చుకునే వాళ్ళ వైఖరి అవలంబిస్తాం," అన్నాను.

సూర్యనారాయణ మొహంమీద చిరునవ్వు కాస్తా బుస్సున ఇంకిపోయింది. అతను నిప్పుపుల్ల వెలిగించి నా సిగిరెట్టు అంటించి తనదికూడా అంటించుకుని పుల్లను సిగిరెట్టుపొగతో ఆర్పేసి "నేను నెల్లూరుదాకా వెళుతున్నాను. అంతదాకా నా కంపార్టుమెంటులోకి రాకూడదూ?" అన్నాడు.

"నీది సెకండుక్లాసు బెర్తా?" అని అడిగాను.

అతను నాకేసి ఆశ్చర్యంగా చూసి, "అవును" అన్నాడు ఆ విషయం సందేహించే అధికారం నాకు లేనట్టు.

"ఎందుకులే ? ఇంటరులో చక్కగా పైబెంచీమీద పక్కపరుచుకున్నా. చాలా దూరం వెళ్ళాలి కూడానూ," అన్నాను.

సూర్యనారాయణ నాతో చెప్పకుండా పెట్టకుండా మా పక్కగా వెళుతున్న టికెట్టు కలెక్టరును పిలిచి నా టికెట్టు సెకండు క్లాసుకు మార్పించటానికి ప్రయత్నాలారంభించాడు.

నాకు సూర్యనారాయణ ప్రవర్తన ఏమీ నచ్చలేదు. కాని ఏంచెయ్యాలో తోచ లేదు. టికెట్టు కలెక్టరు ముందు సూర్యనారాయణతో కొట్లాటలు ప్రారంభించనా? అప్పుడే అతను నూరు రూపాయల నోటు పైకితీసి టికెట్టు కలెక్టరు మొహాన ఝుళి పిస్తున్నాడు. వాల్తేరు దాకా సెకండుక్లాసులో వెళ్ళటానికి నాదగ్గిర డబ్బులేదు. ఇంటరు క్లాసు కొనటమే చాలా సంకోచిస్తూ కొన్నాను.

ఎక్సెస్ టిక్కెట్టిచ్చి డబ్బుపుచ్చుకుని టిక్కెట్టు కలెక్టరు చిల్లర తెచ్చి ఇస్తానని వెళ్ళిపోయిన తరవాత సూర్యనారాయణ, "నీతో సరదాగా గడుపుదామని ఈపని చేశాను. ఏమీ అనుకోకు." అన్నాడు.

చేసేదిలేక సూర్యనారాయణ కూర్చున్న సెకెండు క్లాసు కంపార్టుమెంటులోకి మారాను.

## 3

గంటలు కొట్టారు. ఈలలు వేశారు. సాగనంపవచ్చిన వారు బండిలోనుంచి దిగి ప్రయాణికులతో కిటికీలగుండా ఆఖరుమాటలు మాట్లాడారు. ఇంజను మోత మార్చింది. కూత వేసింది. రైలుకదిలింది.

సూర్యనారాయణ నాతో ఏమీ మాట్లాడలేదు. నేను అతనితోనూ మాట్లాడలేదు. పావుగంట గడిచింది. రైలు గమనం వేడెక్కి బండి జోరుగా పోతున్నది.

"నీకు నన్ను చూడగానే ఏదో దురభిప్రాయం కలిగింది. అవునా?" అన్నాడు సూర్యనారాయణ.

"ఏమి కలగలేదు. నీ దుర్దినాలు అయిపోతే నేను సంతోషించటానికి సిద్ధంగా ఉన్నాను. దరిద్రం పగవాడికైనా ఉండకూడదని నా సిద్ధాంతం. నువు నాకు పగవాడి వైనా కావు. అటువంటప్పుడు నాకు నీమీద దురభిప్రాయం ఎందుకుండాలి?.... నా సంతోషం తెలియజేయటానికి నువు అవకాశం ఇవ్వలేదు. జ్ఞాపకం ఉన్నానా అని అడగటంలో నీ ఉద్దేశమేమిటి? నాకున్న ఐశ్వర్యానికే నాకు తలతిరిగి పోయిందనా? అయితే నాకన్న ఐశ్వర్యంలో ఉన్నావు. నీకెంత తల తిరిగి వుండాలి ? లేక వస్తు

తహా నీలో లేని దుర్బుద్ధులు నాలో ఏమైనా కనిపెట్టావా? కనిపెట్టినట్టయితే నాతో ఎందుకు చెప్పలేదు? స్నేహితుడివి కదా!" అన్నాను.

నా ధోరణికి నివ్వెరపోయి సూర్యనారాయణ, "మాట్లాడితే కరుస్తున్నావేమిటి?" అన్నాడు. అతనీమాట అన్నమీదట అతనిమీద స్నేహభావం కొంత తిరిగి వచ్చింది. మొదటనే నాతో సమానస్థుడల్లే మాటాడివుంటే నేను కాదన్నానా?

"చూడు సూర్యనారాయణా, నీకదివరలో అనేకసార్లు చెప్పాను. నువు అర్థం చేసుకోవటానికి ప్రయత్నించలా. డబ్బురావడంగాని పోవడంగాని అదృష్టమనుకున్నట్టయితే నువు ప్రపంచంమీద పగపట్టకుండా వుండవలసిందికాదు. నీ కష్టసుఖాలన్నిటికీ మనుషులే కారకులన్నట్టయితే నువు నీ నిజమైన స్నేహితులెవరో, నీ శత్రువులెవరో స్పష్టంగా తెల్చుకుని ఉండవలిసింది నువ్వేదీ చెయ్యలేదు. ఇదీ చెయ్యలేదు. నీస్నేహితుల అవసరం గుర్తించావు. కాని అందరూ నీకు శత్రువులే అనినమ్మావు. నా వంటి అభిప్రాయాలు కలవాడికి నీ ప్రవర్తన ఎట్లా నచ్చుతుంది? మే మెవ్వరమూ కష్టాలు పడలేదనుకున్నావా? అంతమాత్రాన మాకూ ప్రపంచానికీ వున్న సంబంధం మరిచిపోయినామా? మరిచిపోలేదు. పై పెచ్చు ఆ సంబంధాన్ని గురించి అనేక కొత్త విషయాలు నేర్చుకున్నాం. నువ్వూ ఆ పనే చేసివుండవలిసింది. దరిద్రస్థితిలో నిన్ను చూసినప్పుడల్లా, "అవకాశం దొరికితే ఈ మనిషి ధనికుడి మన స్తత్వం అవలంబిస్తాడు" అని నా కనిపించేది. ఇప్పుడది కళ్ళారా చూశాను. నా టిక్కెట్టు సెకండు క్లాసుకు మార్పించటమూ, నూరు రూపాయల నోట్లకట్టలు మా మొహాలమీద ఝళిపించటమూ నాకు నచ్చలేదు. ఎక్కడివీ కట్టలు?"

సూర్యనారాయణ వెంటనే నాకు సమాధానం చెప్పలేదు.

"ఇష్టంలేకపోతే చెప్పకు. నువు దరిద్రంలో ఉన్నప్పుడు ఎట్లా గడుస్తున్నదని నిన్నెన్నడూ అడిగినపాపాన పోనివాణ్ని. ఈ డబ్బెక్కడిదంటే చెప్పటం నీకిష్టం లేక పోవచ్చు. కాని నా వుద్దేశంలో దరిద్రం అవమానకరం కాదు. ఖరీదైన గుడ్డలు వేసుకుంటామనీ, సెకండు క్లాసులో ప్రయాణం చేస్తామనీ మనలో ఎవరమూ సంఘానికి గ్యారంటీ ఇవ్వలేం. అటువంటి గ్యారంటీ అడగటానికి సంఘానికి అధికారంలేదు. కాని నువు ఒకప్పుడు దరిద్రం అవమానంగా భావించావు. సాధారణంగా డబ్బు సంపాదించే పద్ధతులే చాలా హేయంగానూ నీచంగాను వుంటై. అందుచేత అడుగుతున్నాను" అన్నాను

సూర్యనారాయణ పౌరుషంగా, "నేను నీచంగానే డబ్బు సంపాదిస్తున్నాను. మర్యాదగా బతకటానికి ప్రయత్నించిన రోజుల్లో పదిరూపాయల నోటు చేతపట్టటం బ్రహ్మ ప్రళయంగా ఉండేది. నువ్వొకడివి నాతో మామూలుగా మాట్లాడావేమో, నా పాత స్నేహితులంతా మొహం తప్పించారు," అని ప్రారంభించాడు.

"నేనూ నీతో మామూలుగా మాట్లాడలేదు. నువు మా కవకాశం ఇవ్వలేదు. నీతో నా మాదిరిగా బాధపడ్డవాళ్ళు కొందరున్నారు నాకు తెలుసు," అన్నాను.

"ఉద్యోగం కోసం ప్రయత్నించాను. అదీ దొరకలేదు. నా ఖర్మం ఇట్లా కాలిందిగాని మా నాన్న బాగా బతికినవాడు. ఆయన స్నేహితుల్లో లక్షాధికార్లున్నారు. ఒక్కడుకూడా సహాయం చెయ్యలేదు. కొందరు నాకు దర్శనంకూడా ఇవ్వలేదు. వాళ్ళనుంచి నేను నౌకరి అడిగానుకాని దానధర్మం అడగలేదు. అడిగినా చెయ్యగలవాళ్ళే. వాళ్లు విలాసాలకోసం ఖర్చుపెట్టేదాన్లో నా అవసరఖర్చు ఎన్నోవంతోలేదు. వాళ్ళమీద నేను పగపట్టటం తప్పా ?"

"వాళ్ళ మీనాన్న నెరిగిన పాపాన నువ్వు వాళ్ళమీద పగపట్టావుగాని. దేశంలో ఇంకా ధనికు లెందరు లేరు ? వాళ్ళమీద పగపట్టావా ? పట్టిమాత్రం ఏం చెయ్యగలవు ? వాళ్ళ కొన్ని పద్ధతులమీద ధనికులు కాగలుగుతున్నారు. ఆ పద్ధతులు అమలులోఉన్నై. వాటిని మార్చటానికి నువ్వేమైనా ప్రయత్నించావా ?"

"సంఘాన్ని మార్చటమేనా నా పని ?"

"కొంతమంది అటువంటి చాదస్తంగలవాళ్ళున్నారు."

"ఉంటే ఉండనీ. నా పని పగతీర్చుకోవటం ?"

"ఎట్లా ?"

"వాళ్ళ పద్ధతులే వాళ్ళమీద ప్రయోగించాను."

"ఏమి టా పద్ధతులు ?"

"మిగతా నీతి నియమాలన్నీ డబ్బుకు తీసికట్టన్నట్టు ప్రవర్తించటం.... నేను వ్యాపారంలో ప్రవేశించాను."

"నీకు పెట్టుబడి ఎక్కడిది ?"

"మన మాధవరావుకు పెట్టుబడి ఎక్కడిది ? కానీ లేకుండా లిమిటెడ్ కంపెనీ పెట్టాడు. ప్రజల డబ్బుతో వ్యాపారం సాగించాడు. లాభంలో అయిదోవంతు కమిషనుకింద కొట్టేశాడు. మేనేజింగు ఏజంటనే పేరుతో చక్కని జీతం పుచ్చుకున్నాడు. దగావ్యాపారం చేశాడు. లాభాలన్నీ తనే తినేసి కంపెనీ దివాలా ఎత్తించాడు. ఇట్లా సంపాదించిన లోకుల డబ్బుతో నాలుగు కంపెనీలు పెట్టాడు. ఒకనాడు వంద రూపాయ లప్పుపుట్టని మాధవరావుకు లక్షరూపాయ లెక్కణించి వచ్చినై ?"

"నువుకూడా కంపెనీ పెట్టావా ?"

"నా పెట్టుబడీ లోకుల కష్టార్జితమైన డబ్బుకాదు. ధనికుల కుమార్తెలూ, భార్యలూనూ !"

"అదేమిటి"? అన్నాను నిర్ఘాంతపోయి.

"మాధవరావు భార్య నాకెప్పుడు కావాలన్నా వెయ్యిరూపాయలు చేబదులిస్తుంది.... మనిషి మాంసం ఖరీదైనది. ఒకంతట ఖర్చయిపోదు.... యుద్ధంలో జనం కొందరు తెగబలిశారు.... నా క్లయింట్లు చాలా పెద్దవాళ్లు. వాళ్ళ నాకు "కానిమారా"లో విందులు కుడుపుతారు.... భార్యాభర్తలిద్దరూ నా క్లయింట్లుగావున్న కేసులుకూడా వున్నై."

"నువ్వేం చేస్తావ్ ?"

"చాలా అమాయకమైన ప్రశ్న వేశావు. నేను పబ్లిసిటీలో ఆరితేరాను. నా సరుకులు నా క్లయింట్లకు వచ్చేటట్టు చెయ్యటమూ, నా వ్యాపారంలో వారికి ఆసక్తి కల్పించటమూ, ఆ ఆసక్తి దిగజారకుండా చూస్తూ వుండటమూ, వారికి ప్రమాదం రాకుండా పైపెట్టున కనిపెట్టి వుండటమూ నాపని. నీ దయవల్ల నా క్లయింట్లు సాధారణంగా జారిపోరు. మొదట కొద్ది వ్యాపారం ఇచ్చినవాళ్ళు క్రమంగా పెద్దవ్యాపారం ఇస్తారు."

నా చెవులు నేను నమ్మలేకపోయాను.

"ఎవరన్నా బయటపడి అల్లరి అయితే ?" అన్నాడు.

"కాకుండా చూస్తాను. భర్మించాలక అయే సూచన కనిపిస్తే అందరికన్న ముందు నేనే అల్లరి ప్రారంభిస్తాను. మొత్తంమీద నా క్లయింట్లు నన్ను భయభక్తులతో చూడటం నేర్చుకుంటారు."

"నిన్ను వీళ్ళు ఏవిధంగా దగ్గరికి రానిస్తారు? నీ సంగతి వాళ్ళు తెలుసుకోరా ?"

"పిచ్చివాడా ! అవినీతి పరులను సంఘం దూరంగా వుంచుతుందని భ్రమలో వున్నావు. అటువంటిదేమీలేదు. నేను మనుషుల్ని—కాస్త కలవాళ్ళను—ఆకర్షించినట్టుగా నువ్వాకర్షించనేలేవు. నువ్వు వాళ్ళ దౌర్బల్యాన్ని బలపరచావు. నేనూ బలపరుస్తాను."

సూర్యనారాయణ ధోరణి వింటున్నకొద్దీ నాకు ఏవగింపు కలిగింది. తానేదో చాలా ఘనమైన పనిచేశానని అతను అనుకుంటూ వుండాలి. తాను సంపాదించే డబ్బును బట్టే తన విజయాన్ని కొలిచివుండాలి.

కాని అతన్ని నేను పల్లెత్తుమాట అనలేదు. అనటానికి నాకేమధికారంవుంది? దేశంలో అవినీతిగా డబ్బు గడించే అధము లెంతమందిలేరు ? అటువంటివాళ్లు అనేకరంగాల్లో ప్రముఖులుగాకూడా వుంటున్నారు. వాళ్ళని నేనేమన గలిగాను? లోకమంతా సూర్యనారాయణ మోస్తరుగానే డబ్బును ఆరాధిస్తున్నది. వస్తువులూ, హృదయాలూ, భావాలూ, విశ్వాసాలూ, అంతరాత్మలూకూడా డబ్బు కమ్ముడుపోతున్నై. "మనిషి మాంసం" అమ్ముడుపోతే వచ్చిందా ? "మనిషి మాంసం"తో వ్యాపారం సాధ్యమైనప్పుడు ఒకరు ఆ వ్యాపారం చెయ్యకుండావుండరు. సూర్యనారాయణ ఆ వ్యాపారం సాగిస్తున్నాడు. తన క్లయింట్లను తృప్తి పరుస్తున్నాడు. వారి నాగరికతకు అవమానం కలిగించని వేష భాషలు అవలంబించాడు.

అతనితో నా కెందుకు మధ్యపేచీ ?

ముద్రణ : ఆంధ్రజ్యోతి,
ఆగస్టు, 1947